
కథ

# గుప్పెడు గింజలు

## యాళ్ల అచ్యుత రామయ్య



పావురాలు గుంపుగా వచ్చి బియ్యం లారీపై వాలుతూ ఉంటే – నింగి నుండి నీలి మేఘం నిదానంగా కిందికి దిగుతున్నట్లుగా ఉంది. ఆ లారీ పిఠాపురం రోడ్డు మీద నుండి కాకినాడ సిటీ వైపు వెళుతోంది. అది చూసి 'నాక్కూడా రెక్కలుంటే ఎంత బావున్ను. ఓ పూటకి సరిపడా గింజల్ని మూటకట్టుకొని వచ్చేవోన్నీ' అనుకున్నాడు చంటి.

ఏళ్ల తరబడి వాడి శరీరంలో ఎదుగుదల లేకపోవడంతో, వాడికప్పుడే పదమూడేళ్లు నిండాయంటే – నమ్మడం కష్టమే! రాగిరంగులోకి మారిన జుట్టూ, గరుకుతేలిన చర్మం, ఎండి బీటలు వారిన పెదాలు, టీ మరకలతో అట్టలు కట్టిన నిక్కరూ, చొక్కాతో – కొత్త బంగళా ముందు నిలబెట్టిన దిష్టిబొమ్మలా ఉన్నాడు వాడు.

నాగమల్లి తోట పరిసరాలలో రోజూ టీ అమ్ముకుంటూ కనిపించే చంటిని చూసిన అక్కడి కూలీలంతా – వాడు పుట్టినపుడే చేతిలో టీ – ఫ్లాస్కుతో పుట్టి ఉంటాడనుకుంటారు. 'చింగల్ టీ' పేరుతో చిన్ని చిన్ని ప్లాస్టిక్ గ్లాసులలో వాడు నింపేది ఉషారేనని వాళ్ళ నమ్మకం. అమాయకంగా ఉండే వాడి మొహం చూస్తే – టీ తాగే అలవాటు లేనివాడికైనా, ఓ కప్పు టీ తాగి, వాడి చేతిలో ఇన్ని చిల్లర డబ్బులు పెట్టాలనిపిస్తుంది.

అలవాటు ప్రకారం వాడి కళ్లు గిడ్డంగి వైపు దారి తీసేయి. కుడి చేతిలోంచి ఫ్లాస్కుని ఎడంచేతిలోకి మార్చుకున్నాడు. ఎండ చుర్రుమంటోందంటే–పదిగంటలు దాటే ఉంటుందనిపించింది. 'పొద్దిటే గిడ్డంగిలో కెళ్లిన లారీల్లోని మూటలన్నీ దింపేసి, ఈపాటికల్లా మేస్త్రిరిలంతా బయటకొచ్చేసుంటారు' అనుకున్నాడు.

గిడ్డంగి – ప్రహారీ గోడ నానుకుని నడుస్తూ ఉంటే, ఉచ్చల కంపుతో వాడి ముక్కుపుటాలదిరిపోతున్నాయి. పాల సైకిళ్లతో, పళ్ల సైకిళ్లతో, టిఫిన్ల సైకళ్లతో, తోపుడు బళ్లతో, అడ్డా కూలీలతో ఆ రోడ్డంతా గజిబిజిగా ఉంది.

చంటి గిడ్డంగి దగ్గరకి చేరుకునే సరికి – ఫుల్‌లోడ్‌తో ఉన్న అయిదారు లారీలు వరసగా మెయిన్ గేటు ముందు ఆగి ఉన్నాయి. వాటిని చూడగానే మంచి గిరాకీ దొరుకుతుందన్న ఆశ చంటి కళ్లలో మెదిలింది.

చంటి నెమ్మదిగా మెయిన్ గేటు దగ్గర నిలబడిన వాచ్‌మెన్ సూర్యారావు దగ్గరకి వెళ్లేడు. అప్పటికే ఏడుపదుల జీవితం – రోడ్డు రోలరులా అతనిపై నుండి నడుచుకుని పోవడంతో, సూర్యారావు బాగా ఒడిలిపోయేడు. అతని ముఖం – ఏళ్ల తరబడి వర్షాలు కురవక, బీటలు వారిన బీడుభూమిలా ఉంది. తన వాళ్లంటూ ఎవరూ లేకపోవడంతో, అతనక్కడే ఉన్న సెక్యూరిటీ రూమ్‌లో ఇంత ఉడకబెట్టుకుని తింటుంటాడు.

''సూర్రావు తాతా! ఓ చింగల్ టీ ఏసేవంటే – మహేష్‌బాబులా టెప్పులేసేత్తావు తెలుసా! డొబ్బులొద్దులే!'' అన్నాడు చంటి.

''ఎంట్రోయ్... సంటిగా, నన్ను కాకా పడతన్నావ్! ఏంటి సంగతీ?''

''ఏం లేదు తాతా, నన్ను కాత్త లోనికి పోనిత్తే, నాలుగు టీలమ్మేసికుంటాను''

''ఎవుణ్ణిబడితే ఆణ్ణి లోనికొదిలేత్తే, నేనెందుకిక్కడ ఉజ్జోగం సేయడవూ! నిన్నొదిలేనంటే, మాసెడ్డ మాటొత్తాదిరా నాకు. నువ్విక్కడే కూకో. పొద్దుటనంగా మూళ్లారీలు లోనికెల్లేయి. ఈపాటికల్లా అయ్యన్నీ కాళీ అయిపోయుంటాయి. మేస్త్రీర్లు బయటికొచ్చే టైం అయింది'' అన్నాడు సూర్యారావు.

చంటి ఉసూరుమంటూ పక్కనే ఉన్న పెద్ద బండరాయి పైన చతికిలబడ్డాడు.

నల్లపుగాకు రెక్కలా ఉన్న ఒకామె, గంప నెత్తుకుని రోడ్డుపై వెడుతూ ''ఎండి సేసలెండి సేపలమ్మోయ్! ఎండి రెయ్యిలూ, పట్టు సాయిడాలూ, ఎండి నెత్తల్లూ, గుడ్డింగలాలూ...'' అంటూ అరు

స్తోంది.


ఎండుచేపల వాసనకి చంటి నోట్లో నీళ్లూరేయి 'నాన్న బతికున్న రోజుల్లో, యేడన్నంలోకి లచ్చిం సారేసుకుని తింటంటే, ఎఱ్ఱటి నిప్పులపై అమ్మ ఎండి సేపని కాలత్తా ఉంటే... నా సావిఱ్ఱంగా...' మంచిగా బతికిన రోజులు గుర్తుకు వచ్చి, వాడి కళ్లు చెమర్చేయి.

చిన్న గేటులోనుండి మేస్త్రీ గంగరాజు, తనతో పనిచేసే కూలీలను వెంటబెట్టుకుని బయటికి వచ్చేడు. కాయకష్టానికి తగ్గట్టుగా తినడం వల్ల – అతని ఒళ్లు బాగా నిగారింపుతో ఉంది. మధ్యవయస్సు మీద పడుతున్నదనడానికి గుర్తుగా అతని చెంపలపైన జుట్టు అక్కడక్కడా నెరిసింది.

చంటి ఫ్లాస్కుని అందుకుని అతని దగ్గరకు పరిగెత్తాడు. "గంఁగ్రాజన్నయ్యా... టీ పోయినా? పొద్దున్నించీ బోనీ కాలేదన్నయ్యా!" అంటూ దిగులు మొహం పెట్టేడు.

గంగరాజు అక్కడే ఉన్న చెట్టు కింద ఉన్న గట్టు పైన కూర్చుంటూ "తలో టీ ఇయ్యిరా, సంటీ!" అంటూ, మిగిలిన వాళ్లని కూడా కూర్చోమని సైగ చేసేడు.

ఆ ముఠాలో కొత్తగా చేరిన కుఱ్ఱాడొకడు



"టిపినీలకని పోతా, ఇయ్యాలప్పుడు టీ తాగత వేంటీ?" అంటూ విసుక్కున్నాడు.

"టిపినీలకే ముందిరా అబ్బాయి, కుంచేపాగి తిందాం!" అని గంగరాజు, చంటి వైపు తిరిగి "తలో చింగల్ పోసేయరా!" అన్నాడు.

చంటి గట్టుమీద ప్లాస్టిక్ గ్లాసులు పెట్టి, టీ నింపుతూ ఉంటే, సూర్యారావు ఒక్కొక్కరికీ అందించేడు. గంగరాజు తన నిక్కరుకున్న సీక్రెట్ పోకట్లోంచి ఏభై రూపాయల నోటును తీసి చంటికిచ్చేడు.

చంటి అక్కడ కూర్చున్న అందరినీ లెక్కబెట్టుకుని "సూఱ్రావు తాతతోబాటు – పద్దాలుగు టీలయ్యేయన్నయ్యా! మొత్తం ముప్పయి అయిదయింది" అంటూ మొలకి చుట్టుకున్న గుడ్డసంచిలోంచి చిల్లర నోట్లు బయటకి తీసేడు.

''సంటీ.. లెక్కలు బానే కడతన్నావురా! సిల్లర దేవుంది కానీ, నీ దగ్గరే వున్నీయ్'' అన్నాడు గంగరాజు.

చంటి చిల్లర నోట్లు లెక్కబెట్టి ''ఈ సాయివే ఎక్కువన్నయ్యా!'' అంటూ గంగరాజు చేతిలో పెట్టేడు.

గంగరాజు బీడీని వెలిగించేడు. చంటి వచ్చి అతని ప్రక్కనే కూర్చుంటూ ''అన్నయ్యా... లారీల్లారీల బియ్యం వొత్తాదిక్కడికి రోజూ. ఏం జేసుకుంటానికీ?'' అన్నాడు.

గంగరాజు తలగోక్కుంటూ ''నాక్కూడా సరిగ్గా తెల్దురా, అబ్బాయి. ఓ మాటు మా యూనియన్ లీడరు చెబుతుంటే ఇన్నా... గవర్నమెంటోడు సెప్పేది మాత్రం – తిండిగింజలు జనానికి సవగ్గా పంచాలనే. ఈ లోగా.. మిల్లర్లు కొంతా, ఆపీసర్లు కొంతా, పందికొక్కులు కొంతా బొక్కేత్తుంటారు. ఆమధ్యెప్పుడో, టన్నుల టన్నుల బియ్యాన్ని ఎలకలు పాడుసేసేయని సెప్పి, సముద్రంలో పారబోసేరంట. ఓ పక్కన జనం ఆకలితో సత్తా ఉంటే, ఇదా మీరు సేసే నిర్వాకం అని పెద్దకోర్టు గిడ్డంగి ఆపీసర్లకి బాగా దొబ్బులు పెట్టిందంట... సావనీ కొడుకులు... ఆళ్ల పాపానికి ఆళ్లేపోతారు'' అంటూ తన వాళ్లని లేవమని చెప్పేడు.

***

సూర్యుడు నడినెత్తి మీదకొచ్చేసరికి – ఫ్లాస్కులోని టీ చాలా వరకూ అమ్ముడుపోయింది. చంటికి కడుపులో యాసిడ్ పోసినట్లుగా ఒకటే మంట. ఉదయం నుండీ వాడి కడుపులో ఏం పడలేదు. ఓ కప్పు టీ తాగితేనో... అనిపించింది కానీ, టీ కొట్టు యజమాని టీని ఫ్లాస్కులో పోసేటప్పుడు గ్లాసులను లెక్కబెట్టడం గుర్తుకువచ్చింది.

అంతలో ఓ లారీ డ్రయివరు గిడ్డంగిలోంచి బయటకి వచ్చేడు. గోడ పక్కకి వెళ్లబోయిన వాడల్లా, చంటిని చూసి ''వొరే, నువ్వు వరాలు కొడుకువేనా?'' అన్నాడు.

''ఊ...'' అంటూ చంటి అతని పేరు గుర్తుకు తెచ్చుకోడానికి ప్రయత్నించేడు.

''మీయమ్మ ఊర్లోనే ఉంటే సెప్పురా రాత్రికొత్తానని'' అన్నాడు.

ఆకలీ, అవమానం ఏకమై చంటిని దహించివేసాయి. గట్టు మీద కూలబడ్డాడు. దాహంతో నాలుక పిడచకట్టుకుని పోయింది. కాళ్లు ఒణుకుతున్నాయి. నిక్కరు జేబులో దాచుకున్న బీడీముక్క చేతికి తగిలింది. రోడ్డు ప్రక్కన చుట్ట కాల్చుకుంటున్న బైరాగి దగ్గరకు వెళ్లి, బీడీ ముక్కని వెలిగించుకున్నాడు. గుప్పు గుప్పున రెండు దమ్ములు లాగేసరికి, ఏదో తెలియని శక్తి వాడి నరాల్లోకి ప్రవహించినట్లయ్యింది.

తన వాళ్లందరికీ మధ్యాహ్నం భోజనాలు పెట్టించి గంగరాజు గోడౌన్ దగ్గరకి తిరిగి చేరుకున్నాడు. అతన్ని గమనించగానే, చంటి బీడీ ముక్కని దూరంగా విసిరేసేడు.


గంగరాజు గట్టుపైన కూర్చుంటూ ''సంటీ.. బీడీలు కాల్సేంత పెద్దోడివైపోయే వేటిరా! నీ వొక్కడి రెక్కల కట్టంతో సంసారాన్ని ఈదలేకే గదరా, మీయమ్మ రోడ్డున బడాల్సొచ్చిందీ'' అన్నాడు.

చంటి మొహం ఎర్రగా కందిపోయింది. ''అన్నయ్యా! నేనింకా సిన్నోన్ని కాదని సెప్పడానికే బీడీ కాలుత్తున్నా. మాయమ్మకింత కూడు పెట్టగల్ను. రాత్రిల్లు మాయమ్మ కోసం ఎవడెవడో రావడం నాకిట్టం లేదు.''

ఆ మాటలు వినగానే గంగరాజుకి జాలేసింది. ''వొరే సంటీ, పొద్దత్తమానవూ నువ్వు టీలమ్మినా, ఆ టీ కొట్టాయన నీకేం ఇత్తాడ్రా! దాంతో నువ్వూ, మీయమ్మా బతగ్గలరేట్రా?'' అన్నాడు.

''లేదన్నయ్యా.. రేపట్నించి నేను పగలూ, రాత్రీ కట్టబడి బాగా సంపాదిత్తా. కానీ...'' అంటూ చంటి ఫ్లాస్కుని అందుకుని నడక ప్రారంభించేడు.

ఆలోచిస్తూ చంటి గిడ్డంగి వెనకవైపుకి వచ్చేడు. గిడ్డంగికి మూడువైపులా ఎత్తైన ప్రహరీ గోడలున్నా, వెనకవైపు సిమెంట్ స్తంభాలను పాతి, వాటిమధ్య ముళ్లతీగని రెండు వరుసల్లో బిగించేరు.




గోడౌన్లు నిండిపోవడంతో కొత్తగా వచ్చిన బియ్యం బస్తాలను, ఆరుబయట సరివి కర్రలతో గద్దెలా కట్టి, వాటిపై పేర్చి, తార్పలిన్‌తో కప్పి ఉంచుతున్నారు. ఈ దృశ్యాన్ని చూడగానే చంటి మెదడులో ఓ మెరుపు మెరిసింది.

***

టీ కొట్టు యజమాని తనకిచ్చిన కోటాని అవగొట్టడానికి, గానుగెద్దులా గిడ్డంగి చుట్టూ తిరిగి, తిరిగి చంటి అలసిపోయేడు. కాళ్లీడ్చుకుంటూ వచ్చి రాత్రి తొమ్మిది గంటల కల్లా తన బస్తీకి చేరుకున్నాడు. తమ రేకులషెడ్డులోంచి దీపం వెలుతురు కనిపించి 'హమ్మయ్యా... అమ్మ ఇంట్లోనే ఉంది' అనుకుంటూ రేకు తలుపును నెట్టేడు, అది తెరచుకోకపోవడంతో చంటి తలుపుపైన తట్టేడు.

కొంత సేపటికి తలుపు తెరుచుకుంది. ఓ మగ మనిషి చొక్కాకి గుండీలు పెట్టుకుంటూ బయటికి వచ్చి, చీకట్లో కలిసిపోయేడు.

కోపంతో జ్వరం కాచినట్లుగా చంటి ఒళ్లంతా వేడెక్కిపోయింది. చీరను సవరించుకుంటూ తల్లి తలుపు దగ్గరికి వచ్చింది. ఆమెను చూడగానే, వాడిలో కోపం బుసలు కొట్టింది. మధ్యాహ్నం లారీ డ్రైవర్ 'రాత్రికి వత్తానని మీ అమ్మకు చెప్పరా' అన్న మాటలు పదే పదే గుర్తుకు వచ్చి తల్లంటే జుగుప్స కలిగింది. చంటి కోపాన్ని గమనించిన వరాలు వెనక్కి నడిచి, గాలివానకి కూలిపడిన మానులా చింకి చాపపై వాలిపోయి బోరుమంటూ ఏడ్చింది.

తల్లి ఏడుపుని తట్టుకోలేని చంటి ''అమ్మా.. ఏడవకే!'' అంటూ వెక్కివెక్కి తనూ ఏడ్చేడు.

కొంతసేపటికి వరాలు తేరుకుంది. కొడుకు జుట్టుని సవరిస్తూ ''సంటీ... గుడిసెలో గుప్పెడి గింజలు కూడా లేవురా! ఏం సేయను సెప్పరా.. ఏ దారీ... లేకే...'' ఆపైన మాట్లాడలేకపోయింది.

చంటి తల్లి వంక దీనంగా చూసేడు. లేచి వెళ్లి నులక మంచంపై వాలిపోయేడు. రకరకాల ఆలోచనలు గబ్బిలాల్లా వెంటాడుతూ ఉన్నాయి. 'అమ్మని కట్టపెట్టకూడదు. తిండికి సరిపడా గింజలు నేనే సంపాదించాల!' అనుకుంటూ కళ్లు మూసుకున్నాడు.

***

ఎక్కడి నుండో కోడికూత వినిపించడంతో చంటికి మెలకువ వచ్చేసింది. మసీదులోంచి నమాజు వినిపిస్తోంది. పూర్తిగా తెల్లవారినట్లు లేదు. షెడ్డులో దీపం మిణుకు మిణుకుమంటూ – ఏ క్షణంలోనైనా కొడికట్టడానికి సిద్ధంగా ఉంది.

రాత్రి తనకొచ్చిన ఆలోచనని ఆచరణలో పెట్టాలనుకున్నాడు. చప్పుడు చేయకుండా షెడ్డు బయటకి వచ్చి, రేకు తలుపును నెమ్మదిగా దగ్గరికి జరిపేడు. చలీ, ఆకలీ, చీకటీ ముప్పేటగా వాడిపై దాడి చేస్తున్నాయి.

రెండు సందులు దాటేసరికి తప్పు చేస్తున్నానన్న ఆలోచన వాడికి ఊపిరి సలపనీయకుండా చేస్తోంది. తెలుసున్న వాళ్లెవరన్నా ఎదురవుతారేమోనన్న భయం అడుగడుగునా వెంటాడుతోంది.

అలవాటు పడిన దారి కావడంతో, మసక చీకట్లో కూడా తడుముకోకుండానే గిడ్డంగి వెనకి వైపుకు చేరుకున్నాడు.

ఫ్లడ్ లైటు వెలుగులో ముళ్లతీగ మెరుస్తూ ఉంది. ముళ్లతీగని చెప్పుతో తొక్కి ఉంచి, పైనున్న వైరును కుడిచేత్తో పైకి లేపి, నెమ్మదిగా తలవంచి సగం వరకూ దూరిపోయేడు. చేతిలోంచి వైరు జారిపోవడంతో, తీగకున్న ముళ్లు రెండు వాడి వీపులో గుచ్చుకున్నాయి. ముందుకీ, వెనక్కీ కదల లేకుండా ఉంది. వీపంతా ఒకటే మంట! వీపులో గుచ్చుకున్న వైరుని ఎడంచేత్తో పైకిలేపి, రెండు కాళ్లనీ లోపలికి పెట్టేడు. 'అమ్మయ్యా.. ఒక గండం గడిసింది' అనుకున్నాడు. వీపు తడుముకుంటే చేతికి రక్తం వెచ్చగా తగిలింది.

కొద్ది అడుగులు వేయగానే– ఆరుబయట బియ్యం బస్తాలను నిలబెట్టి, తార్పలిన్ షీటుతో కప్పిన ప్రాంతం కనిపించింది. తార్పలిన్ అంచులకు తాళ్లు కట్టి, నాలుగు వైపులా నేలలోకి దిగ్గొట్టిన గూటాలకి ముడివేసి ఉన్నాయి. చంటి జేబులోంచి చాకుని బయటకి తీసి, ఒక వైపు తాడును కష్టపడి కోసేడు. తార్పలిన్ కవర్ని కొద్దిగా పైకి లేపి, నెమ్మదిగా లోపలికి వెళ్లేడు. లోపలంతా వేడీ, పురుగుల మందుల ఘాటూ, పందికొక్కుల ఉచ్చల వాసనా! చంటికి ఊపిరి సలపక బయటకి వచ్చేసేడు.

గట్టిగా గుండె నిండా చల్లని గాలిని పీల్చుకుని, మళ్లీ లోపలకి దూరేడు. మధ్యలో ఉన్న ఒక బస్తాకి అప్పటికే చిల్లు పడి ఉంది. నిక్కరు జేబులోంచి ఓ ప్లాస్టిక్ సంచిని బయటకు తీసి ఆ చిల్లు దగ్గర పెట్టి బస్తాకి రెండు వైపులా ఒత్తేడు. బియ్యం ధారగా పడుతూ ఉంటే వాడికప్పుడే ఆకలి తీరిపోయినట్లనిపించింది. ఎవరైనా తనని గమనిస్తున్నారేమో అన్న ఆలోచన రాగానే ఒళ్లంతా ముచ్చెమటలు పోసేయి. చంటి చిల్లు పెట్టిన బస్తాలో బియ్యం తగ్గడంతో హఠాత్తుగా పైనున్న ఓ బస్తా కదిలింది. అది కాస్తా కిందికి జారి చంటి భుజంపై పడడంతో దాని బరువు మోయలేక బొక్కబోర్లా పడిపోయేడు చంటి. ఆ వెంటనే ఒక్కో బస్తా దొర్లి పడ్డాయి.

చంటి శరీరం బస్తాల మధ్య కూరుకుపోయింది. వాడు గట్టిగా 'అమ్మా' అంటూ అరిచిన పిలుపు బస్తాల మధ్యే ఉండిపోయింది.

***

సూర్యారావు నిద్ర లేచేసరికి పక్కలో నైట్ డ్యూటీ చేసిన గార్డు ఎప్పుడు వచ్చి పడుకున్నాడో కానీ, గాఢ నిద్రలో ఉన్నాడు.

రోజువారీ చెక్కింగ్‌లో భాగంగా సూర్యారావు లాఠీని, టార్చిలైటుని అందుకుని... మెయిన్ గేటు దగ్గర నుండి చెక్ చేసుకుంటూ గిడ్డంగి వెనక వైపుకి చేరుకున్నాడు. నలు చదరంగా కట్టిన స్టాక్... కుప్పకూలిపోయి కనిపించింది. తార్పలిన్ కవర్ని పక్కకి లాగి చేసేడు. బియ్యం బస్తాలు అన్నివైపులకీ జారిపోయి కనిపించేయి. దగ్గరికి వెళ్లేసరికి ఏదో మూలుగు వినిపించింది. గబగబా లాఠీతో బస్తాలను నెట్టబోయేడు కానీ, అతని బలం సరిపోలేదు. ఆ బస్తాల మధ్యలోంచి ఓ లేత చేయి కనిపించేసరికి, వెన్నులో సన్నగా వణుకు ప్రారంభమైంది.

గబగబా సెక్యూరిటీ రూమ్ వైపు పరిగెత్తేడు. రాత్రి డ్యూటీ చేసి పడుకున్న గార్డుని సాయం కోసం లేపుదామనుకున్నాడు. అతని మొద్దు నిద్ర గురించి గుర్తుకు వచ్చి, ఆ ప్రయత్నం విరమించుకున్నాడు.

వెనక్కి మళ్లి, స్టాక్ యార్డులోకి పరుగుతీసేడు. 'అయ్యో... వక్కడితో ఏం అవుద్ది?' అంటూ మెయిన్‌గేటు వైపు పరుగుతీసేడు.

సూర్యారావు గేటు బయటకి వచ్చేసరికి, గంగరాజు బీడీ కాల్చుకుంటూ కనిపించేడు. అతన్ని చూడగానే, సూర్యారావుకి కొండంత ధైర్యం వచ్చింది.

''ఏం సూర్రావు మావా! పొద్దుట పొద్దుటే గుమస్తా ఫోన్ సేసి పెందలకాడే లోడ్ దిగిపోతందని అన్నాడు. ఇంతవరకూ ఒక్క లారీ రాలే'' అన్నాడు గంగరాజు.

సూర్యారావు అతని దగ్గరకు పరిగెత్తుకుని వచ్చి ''బావూ గంగ్రాజూ.. టైంకి దేవుళ్లా వచ్చేవు... బత్తాలకిందెవరో పిల్లో, పిల్లాడో ఇరుక్కుపోయేరు... ఇందాకైతే పేణాలతోనే వున్నట్టనిపించింది. బేగా రాయ్యా..'' అని బ్రతిమాలేడు.

గంగరాజు వెంటనే బీడీని బయటకి విసిరేసి, గోడౌన్ వెనక్కి పరుగు తీసేడు. సూర్యారావు అతని వెనకే ఆయాసపడుతూ పరుగులాంటి నడకతో బయల్దేరేడు.

గంగరాజు ఒక్కో బస్తాని అవలీలగా లేపి ప్రక్కకి విసిరివేస్తూ ఉన్నాడు. పూర్తి వెలుతురు రావడంతో అతని పని మరింత సులువయ్యింది.

ఏ మూలుగూ వినిపించకపోయే సరికి సూర్యారావుకి అనుమానం వచ్చింది. 'కొంపతీసి...' ఆపైన ఆలోచించలేకపోయేడు.

నుదిటికి పట్టిన చెమటని కూడా తుడుచుకోకుండా గంగరాజు బస్తాలను పక్కకి లాగేస్తూ ఉన్నాడు. ఆఖరి బస్తాను లాగేసే సరికి, పిల్లాడి శరీరమంతా చెమటతో తడిచి ముద్దయిపోయి ఉంది. బోర్లా పడిపోయి ఉన్న కుర్రాడ్ని వెల్లకితలా తిప్పేసరికి ఒక్కసారిగా షాక్ తగిలినట్లై ''అయ్యో! మనకు పెతిరోజూ టీలు పోసే చంటోడేరా'' అంటూ గట్టిగా అరిచేడు.

''ఒరే సంటీ... కళ్లు తెరవరా!'' అంటూ గంగరాజు వాడి రెండు చెంపల పైనా చరిచేడు. చంటి గుండెపై చెవి ఆనించి విన్నాడు.

హఠాత్తుగా పైకి లేచి ''సూర్రావు మావా! గుండింకా పీలగా కొట్టుకుంటుంది'' అన్నాడు గంగరాజు.

గంగరాజు గబగబా చంటి ఒంటిపైన చొక్కా బొత్తాలను విప్పేసి, తువ్వాలుతో విసరడం ప్రారంభించేడు. రెండు చేతుల పైనా చంటిని పడుకోబెట్టుకుని వేగంగా కుదిపేడు.

చంటి పెదాలు ఒణికేయి. గంగరాజు కళ్లలో నీళ్లూరేయి.

''సూర్రావు మావా...పక్కసందులో ఉన్న డాటేరు దగ్గరికి తీసుకుపోతే...'' అంటూ ఒక్క ఉదుటున చంటిని భుజం పైకేసుకొని పరుగు తీసేడు.

చంటిని మోసుకుని పరిగెడుతున్న గంగరాజుని చూస్తున్న సూర్యారావు కళ్లు చెమ్మగిల్లేయి. ఆకాశం కేసి చూస్తూ రెండు చేతులూ జోడించి ఏదో గొణిగేడు.

గంగరాజు అడుగుల శబ్దానికి స్వేచ్ఛగా గింజలేరుకుతింటున్న పావురాలు బెదిరినట్టుగా ఒక్కసారిగా ఆకాశంలోకి ఎగిరాయి. నల్లని మబ్బేదో ఆకాశంలో మెల్లగా కదిలిపోతున్నట్టు ఓ నీడ గిడ్డంగిపై పరచుకుంది.

*

రచయిత సెల్ నెం. 9177303231




## మనోళ్లే కానీ..!

మనోళ్లే కానీ
ఎదలోపలి చెలిమే
ఎండిపోతున్నది,
రక్తం పంచుకున్న వాళ్లే మరి
ప్రాణ స్పర్శ లోపిస్తున్నది!
మనోళ్లే కానీ
లోలోన చెదలు పట్టినట్టు
ఆత్మీయతలను తినేస్తున్నది,
ఎవరి ప్రపంచం వారిదేనంటే
చివరికి సొంత ప్రపంచం కూడా
మిగిలితే ఒట్టు!
మనోళ్లే కానీ
చిన్ననాటి వాత్సల్యం
వయస్సుతో పాటు కరిగిపోతున్నది,
స్వార్జితమే స్వార్థంగా బుసకొట్టి
మమకారాలను కాటేస్తున్నది!
మనోళ్లేకానీ
పసుపు–పంచరంగుల
నోట్ల రెపరెపల్లో
గుండెచప్పుడు మాయమవుతున్నది,
అంతరంగంలో నిస్సహాయంగా
దీనంగా రోదిస్తూ
అరమరికలు లేని
స్నేహంకోసం చేతులు చాస్తున్నది!

–నిఖిలేశ్వర్